# గోదారమ్మ-1

"అదివో...అల్లదివో శ్రీహరివాసమూ...

అదివో అల్లదివో శ్రీహరివాసమూ...పదివేల శేషుల పడగల మయమూ....

అదివో అల్లదివో...శ్రీహరి వాసమూ..." కమ్మని కంఠస్వరంతో సాగుతున్న అన్నమయ్య సంకీర్తన మైమరిచి వింటూ మరోలోకంలోకి అడుగుపెట్టిన అనుభూతిలో మునిగి పోయిన ఆవిడ... పాట ఆగిపోయిన విషయాన్నీ గమనించలేదు! "అమ్మా... మీరు" అంటూ ప్రశ్నించిన ఆమె వైపు అయోమయంగా చూసి... ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చి నిట్టూర్చింది.

"నేను... నేను..." అంటూ తడబడిన ఆవిడ ఒక క్షణం నిశ్శబ్దంగా ఉండి... తర్వాత మెల్లగా చెప్పింది.

"నేను... దూరం నుండి వస్తున్నానమ్మా" అంటూ చేతుల్లో ఉన్న రెండు బ్యాగ్ లనూ క్రింద పెట్టింది.

"అదిగో... అక్కడ కూర్చున్న వాళ్ళని... కాఫీ తాగుతున్నారు కదాని... ఇక్కడేదైనా హోటల్ ఉందా అనడిగా. లేదని చెప్పి... వాళ్ళకి మీరే రోజూ కాఫీ ఇస్తూంటారనే విషయం చెప్పారు. వాళ్ళ నలుగురికీ కాఫీ ఇవ్వటమే కాకుండా, పేపరునూ తెప్పించి పెడతారట కదా... పేపరును తిరగేస్తూ, కాఫీ తాగుతూ... కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసి... తర్వాత ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతామని చెప్పారు! ఆ చెట్టు చుట్టూ ఉన్న సిమెంటు చప్టాని వాళ్ళందరూ కూర్చోవటానికి మీరే ఏర్పాటు చేసారట కదా... ఈ విషయాలన్నీ విన్నాక నాకూ ఏదైనా ఏర్పాటు చేయగలరేమోనని కనుక్కుందామని వచ్చా... ఎవరైనా పెద్దవాళ్ళు ఉంటారనీ అనుకుంటున్నా. మీ అమ్మ వాళ్ళుగానీ... అత్తా మామలుగానీ ఉంటే... పిలుస్తే... నేనీ విషయం అడుగుతా. ఇంతకీ పాట పాడుతున్నది నువ్వే కదమ్మా... చాలా మంచి కంఠం... మైమరిచిపోయాను సుమా.. సంగీతం నేర్చుకున్నావా....?"

ఆవిడ ప్రశ్నలకి చిరునవ్వుతో చూసిన ఆ అమ్మాయి జవాబు చెప్పింది.

"నేనే నమ్మా... కాకపోతే... అలా కూనిరాగాలు తీయటమేగానీ ప్రత్యేకంగా సంగీతం నేర్చుకోలేదు! ఇహ... ఈ ఇంట్లో పెద్దవాళ్ళెవరూ లేరు. నేనూ, మా అబ్బాయీ ఉంటామంతే. ఈ సంగతీ వాళ్ళు చెప్పే ఉంటారేమో కదా! నేను ఏదో కాలక్షేపంగా ఆ నలుగురు పెద్దవాళ్ళకీ నాతోపాటుగా కాఫీ కలిపి ఇస్తూండటం

ఓ అలవాటయింది! మరి... మీ కెలాంటి ఏర్పాటు చేయగలనూ... చెప్పండి" అంది ఆవిడ క్రింద పెట్టిన బ్యాగులవైపు చూస్తూ.

"అంటే... నేను ఒక్కదాన్నీ ఉండటానికి చిన్న పోర్షను లాంటి ఇల్లు... ఇక్కడకు దగ్గర్లో ఉందా అని వాకబు చేయాలనీ..." అంటూ ఆవిడ మాటలు ఆపేసింది.

ఆ అమ్మాయి ఆవిడవైపు కొంచెం ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటమ్మా మీరంటున్నది...? మీరు... ఎవరింటికో ఈ వూరు రాలేదా? ఇక్కడే ఉండాలనుకుంటున్నారా...? ఎందుకనీ...?"

ఆ ప్రశ్నలకు ఆవిడ మళ్ళీ నిట్టూర్చింది.

"ఇక్కడే ఉండాలనుకుంటున్నాను... ఇక వివరాలంటావా... ప్రస్తుతానికి ఏమీ చెప్పలేను... నిదానంగా చెబుతాను!"

ఆ మాటలతో ఆ అమ్మాయి మొహం వెలిగిపోయింది.

"సరేనమ్మా... మీరు... మీ వివరాలేవీ చెప్పనక్కర్లేదు! చిన్న పిల్లాడితో నేను ఒక్కదాన్నే ఉంటున్నాను కాబట్టి... మీరూ మాతోనే ఉండొచ్చు... మీ కభ్యంతరం లేకపోతేనే సుమండీ! నేను ఇక్కడికి దగ్గర్లోనే ఓ స్కూలులో టీచరుగా ఉద్యోగం చేస్తున్నా. అబ్బాయి నీ నాతో తీసుకుని వెళ్తూంటా. పక్కనున్న రెండు గదులూ ఖాళీనే. మీరు ఉంటానంటే... నాకూ పెద్ద దిక్కుగా ఉంటారు కాబట్టి చాలా సంతోషం... మీకు... ఇష్టమేనా...?" అనడిగింది ఆ అమ్మాయి.

ఆవిడ చిరునవ్వుతో తలవూపుతూ "నీ పాటలు వింటూ... మీతో కలిసి ఉండటం నాకూ చాలా బావుంటుందనిపిస్తోంది! నాకు... సంగీతం రాదుగానీ... పాటలు వినటం, నీలాగే చిన్నగా రాగాలు తీయటమూ అలవాటే...!" "అవునూ …నీపేరేమిటమ్మా....?" అనడిగింది.

"సీత..." అని చెప్పి "మీ పేరు అడగవచ్చునా...?" అంది.

ఆవిడ అక్కడకు కొంచెం దూరంగా కనిపిస్తున్న గోదావరిని చూపిస్తూ వేలు చూపించి ఏదో అనబోతోంటే... సీత నవ్వు మొహంతో అంది "అంటే... మీ పేరు.. గోదావరమ్మ అంతేగా...?"

ఆవిడ చిరునవ్వుతో వెంటనే తలవూపింది..'' అవును గోదారమ్మ'' అంది.

సీత ఆనందంగా "నేను మీ పేరును భలేగా కనిపెట్టేశాను కదండీ!" అంది. 'అవును' అన్నట్లుగా ఆవిడ తలవూపుతూ ఇంకొక మాటా చెప్పింది. "ఆ గోదావరిని ప్రతీరోజు చూడగలిగే అదృష్టం కలుగుతోంది! ఈ ఇల్లు కొంచెం ఎత్తులో గోదావరి బాగా కనిపించేట్టుగా ఉంది! అందుకేనేమో ఈ ఇంట్లోనే నివాసం లభించినందుకు చాలా ఆనందంగా ఉంది. చుట్టు పక్కల ఏదైనా పోర్షను అద్దెకు దొరుకుతుందేమో ననుకుంటే... నీ ఇంట్లోనే చోటు ఇచ్చావు కదమ్మా...!"

ఆవిడ మాటల్లో కనుపించిన కృతజ్ఞతా భావానికి కరిగిపోతూ సీత ఆవిడతో "అమ్మా... మీలాంటివారితో కలిసి ఉండే అదృష్టం కలిగినందుకు నాకూ చాలా ఆనందంగా ఉందమ్మా... మిమల్ని చూడగానే ఆత్మీయతా భావం కలిగింది!" అంది కళ్ళల్లో సంతోషాన్ని చూపిస్తూ.

అపుడే లోపలనుండి వచ్చిన చిన్నపిల్లాడు ఆవిడను చూస్తూ "ఎవరు?" అన్నట్లుగా కళ్ళెగరేశాడు.

"అమ్మమ్మ అవుతారు నీకు. నువ్వస్తమానం అడుగుతుంటావుగా, అందుకే వచ్చారు. ఇక నుండీ మనతోనే ఉంటారు!" అంది ఆ పిల్లాడిని దగ్గరకు తీసుకుని.

వాడు చాలా సంతోషంగా "నిజంగా...?" అంటూ ఆవిడవైపు చూసే సరికి ఆవిడా ఆ పిల్లాడిని దగ్గరకు తీసుకుని "నిజమే బాబూ... మీతోనే ఉంటాను. ఇక ఎక్కడికీ వెళ్ళను!" అంది.

చిన్న పిల్లాడితో కాలక్షేపం బావుంటుందనిపించింది ఆవిడకూ. పిల్లాడిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని "పేరేమిటమ్మా...?" అనడిగింది.

"రంగ" అన్నాడు వాడు ముద్దుగా.

"బావుంది! రోజుకి నాలుగైదు సార్లు నిన్ను పిలుస్తున్నట్లుగా, నీ పేరుని పలుకుతే... ఆ భగవంతుడిని తలుచుకుంటున్నట్లు పుణ్యం వస్తుందన్నమాట!" అందావిడ వాడిని చిరునవ్వుతో చూస్తూ.

సీత కూడా సరదాగా చిన్నగా నవ్వింది.

"అమ్మా... వీడిని స్కూల్లో దింపి, నేను ఈ రోజుకి సెలవు పెట్టేసి వస్తాను. ఈ రోజంతా మీక్కావలిసినట్లుగా ఇల్లు సర్దటమూ, భోజనం ఏర్పాట్లూ చేస్తా...!" అంది హుషారుగా సీత.

"ప్రస్తుతానికి బట్టలు మాత్రమే ఉన్నాయి. అవసరాన్ని బట్టి ఒక్కో వస్తువూ కొనుక్కుంటాను. ఒక్కదాన్నే కదా, అంత అవసరాలేవీ ఉండవు. నువ్వు నీ ఉద్యోగం చూసుకోమ్మా… సెలవు పెట్టాల్సినంత అవసరం లేదులే…!" అందావిడ.

"అలా అనకండి… నాకు చాలా ఉత్సాహంగా ఉంది మాకు ఒక తోడు దొరికినందుకు. సెలవులు చాలానే ఉన్నాయి. అందుకే పెట్టాలనుకుంటున్నా. ముందు కాఫీ తెస్తానుండండి" అంటూ సీత లోపలకు వెళ్ళింది.

సీత తెచ్చిచ్చిన కాఫీని ఇష్టంగా తాగిందావిడ. పక్క గదిలోకి తీసుకెళ్ళి మంచం మీద దుప్పటి పరచి "మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి. బట్టలవీ అలమరాలో పెట్టుకోండి…" అని చెప్పి సీత మళ్ళీ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

కాసేపటిలోనే ఆవిడకు ఉప్మా ప్లేటు అందించి… పిల్లాడిని తీసుకెళ్ళి బడిలో దింపి వచ్చేసింది.

తర్వాత… ఇద్దరూ కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

ఆవిడ తన వివరాలేవీ ప్రస్తుతానికి చెప్పలేనని అంది కాబట్టి సీత అలాంటి విషయాల ప్రసక్తి లేకుండా ఆవిడకు ఏర్పాట్లు చేసింది.

తన వివరాలు అడగవద్దని చెప్పింది కాబట్టి ఆ అమ్మాయి వివరాలనూ అడగటం సమంజసం కాదని ఆవిడా అడగలేదు.

కాకపోతే ఇద్దరి ఆలోచనలూ అటువైపే సాగాయి.

"ఈ సీత భర్త ఏం చేస్తున్నాడో… అతని ప్రసక్తి తీసుకురాలేదు… కొడుకుతోనే ఉంటున్నానని చెప్పింది…. ఎందుకనో… కారణం ఏమై ఉంటుందో… ఈ అమ్మాయి విషయాలు, వివరాలు ఏమీ తెలియకుండా తనతో కలిసి ఉండటం మంచిదేనా…? " అనుకుందా ఆ పెద్దావిడ. "మెల్లగా అన్ని విషయాలూ తెలుస్తాయిలే. ఏవో కారణాలవల్ల ఒంటరిగా ఉంటోందేమో! అయినా అమ్మాయి, చిన్నపిల్లాడితో కలిసి ఉండటం వలన, వాళ్ళెవరో ఏమీ తెలియనంత మాత్రాన తనకి వచ్చిన నష్టం ఏముంటుందీ… తన దగ్గర పోగొట్టుకోవటానికైనా ఏం లేదుగా…!" అని ఆవిడ తనకు తానే సర్ది చెప్పుకుని స్థిమితపడి… నిశ్చింతగా ఉండొచ్చని నిర్ణయించుకుంది.

సీతా అలాగే ఆలోచించింది. 'ఆమె ఎక్కడనుండి వచ్చారూ... ఈ ఊళ్ళోనే ఒంటరిగా ఎందుకు ఉండాలనుకుంటున్నారూ? పిల్లలూ వాళ్ళూ ఎవరూ లేరా? ఒంటరిగా ఉండాలనే ఆలోచన ఎందుకు వచ్చిందో? వివరాలేవీ ప్రస్తుతానికి చెప్పలేననీ, చెప్పననీ ఎందుకు అన్నారో...?"

ఇలాంటి ప్రశ్నలన్నీ మనసులోకి వచ్చినా... సీత ఈ విధంగా ఆలోచించింది.

"తన విషయాలేవీ పూర్తిగా తెలుసుకోకుండానే తన ఇంట్లో ఉండటానికి ఇష్టంగా అంగీకరించారు. ఇందులో తనకేమీ అభ్యంతరం లేదు. ఆమె ఇంటి అద్దె ఎంతనిగానీ అలాంటివేం అడగలేదు. ఆమె ఏమీ ఇవ్వకపోయినా తనకేమీ నష్టం ఉండదు. ఎప్పుడూ ఎవరికీ అద్దెకు ఇవ్వలేదు కాబట్టి, ఖాళీగానే ఉండే బదులు ఇపుడు ఇంకొకరు ఉంటారు.. అంతేగా! తన సంపాదన కొంచమే అయినా ఒక నలుగురికీ ఉదయం పూట కాఫీ ఇవ్వగలుగుతోంది! ఇప్పుడు ఇంకొక మనిషికి బోజనం కూడా పెట్టాలి! అంతేగా... ఆ మాత్రం తను భరించగలదు కాబట్టి ఇబ్బందేం లేదు... ఆమెకు ఎలాంటి ఆదాయం, రాబడీ లేకపోయినా ఫర్వాలేదు.

ఎందుకోగానీ ఆమెను చూడగానే గౌరవ భావం.. ఏదో ఆత్మీయతా కలిగాయి. కొందరిని చూడగానే చెయ్యెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుందంటారు. ఆవిడను చూసినపుడు తనకా మాట నిజమేననిపించింది! తనకో మంచితోడు పెద్ద దిక్కులా దొరకటం ఆనందించాల్సిన విషయమేగానీ, మరొకలాంటి ఆలోచనకు ఆస్కారమే లేదు...ఆ దేముడే తనకో తోడు పంపించాడని" సీత మనసులోనే తీర్మానించుకుంది.

మంచంమీద పడుకుని ఉన్న ఆమెకు సీత ఎవరితోనే అంటున్న మాటలు వినిపించాయి!

"చెబుతున్నానుగా, మాకు దూరపు బంధువని, నాకు పెద్దమ్మ వరస అవుతారని! చాలా దూరంలో ఉంటున్నారు. నేను ఒక్కదాన్నీ పిల్లాడుతో కలిసి ఉంటున్నానని తెలిసి మాతో ఉందామని వచ్చారు...!"

".... ..... ...."

"ఏ వూరయితేనేం, ఊరి పేరు ఎందుకు చెప్పూ.... నువ్వెళ్ళి చూసిరావు కదా... మరి ఇంకెందుకు నీకిన్ని ఆరాలు...?"

గోదారమ్మ సీత మాటలు విని మనసులోనే నవ్వుకుంది. 'తనను ఎవరూ ఏ వివరాలూ అడగకుండా సమాధానం బాగానే చెప్పేసింది... ఎవరితోనో మరి' అనీ అనుకుంది.

ఆ మరునాడు... సీత కాఫీ తాగటానికి వచ్చినవాళ్ళని గోదారమ్మకు పరిచయం చేసింది.

ఒకాయనను చూపించి "ఈయన పేరు రామానుజంగారు... రిటైర్డ్ పోస్ట్ మాస్టర్... అంటూ ఇంకొకాయనను చూపించి... వీరూ రిటైర్డ్ స్కూలు మాష్టర్... బ్రహ్మంగారు అంటూ సీత చెబుతోంటే ఇంకొకాయన అడ్డం వచ్చి..." ఇలా ఒక్కొక్కరికీ రిటైర్డు అని చెప్పటమెందుకమ్మా... అందరం ఉద్యోగ విరమణ చేసిన బాపతేగా... అందుకని... ప్రభుత్వం వారు 'చేసిన సేవలు ఇక చాల్లే, ఇంట్లో కూర్చోండీ' అంటే... ఖాళీగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాలాన్ని దొర్లిస్తున్న బాపతు జనం అని ఒక మాట చెప్పేస్తే... అందరికీ సరిగ్గా సరిపోతుందిగా...!" అనగానే అందరూ చిన్నగా నవ్వేరు.

వెంటనే రామానుజం అనబడే అతను అందించుకుంటూ ఆ మాటలన్నతని చూపిస్తూ అన్నాడు "ఈయన సార్థక నామధేయుడండీ... పేరు ఆనందరావు. ఈయన మాటల్లో కొంచెం చమత్కారం కూడా ఉంటూ వుంటుంది కాబట్టి మేం సరదాగా 'హాస్యానందం' అని అంటూ వుంటాం..." అని చెప్పి నవ్వు మొహంతో చివరగా ఉన్న అతని వైపు చేయి చూపిస్తూ "వీరు... వీరభద్రంగారు... నిజానికి పేరులో ఉన్న వీరత్వం ఛాయగానైనా మనిషిలో కనుపించదు ఎప్పుడూ నీరసంగా అనిపిస్తూ ఉంటారు..!" అని చెప్పాడాయన కొంచెం చమత్కారంగా.

గోదారమ్మ వాళ్ళందరివైపు చిరునవ్వుతో చూసింది.

వీరభద్రం అనబబడే ఆయన వెంటనే సమాధానం చెప్పాడు "చూడండి... ఈ వయసులో మౌనంగా ఉండక... హుషారుగా చలాకీగా గెంతుతూ ఉండటం సాధ్యమా... నాకు నిజానికి అందరి మాటలూ వినటమే ఇష్టం. ఏం చెప్పాలో, ఎలా కల్పించుకోవాలో తెలియక మౌనంగా ఉంటూ వుంటాను! ఈ మాట మాత్రం నిజమేననుకోండీ!" అన్నాడు గోదావరమ్మగారికి చేతులు జోడిస్తూ, మొహంలోకి చిరునవ్వు వచ్చింది.

ఆవిడ సమాధానంగా చిరునవ్వుతో అంది "మీరింత చక్కగా నవ్వుతుంటే మీకు నీరసం ఏమిటండీ?" అంది.

"నిజమే...! అయితే ఇక ఎవ్వరం 'నీరసాల భద్రంగారు' అనకుండా చక్కగా 'నవరసాల భద్రంగారు' అందాం! ఏమంటారూ?" ఆనందరావు అనగానే "బావుంది... బావుంది..." అంటూ అందరూ సరదాగా నవ్వేరు.

రామానుజం గోదావరమ్మ వైపు చూస్తూ అన్నాడు “అమ్మా... మీరు సీతమ్మతల్లితో కలిసి ఇక్కడే ఉండాలని నిర్ణయించుకోవటం... మా అందరికీ కూడా చాలా సంతోషంగా ఉంది! ఈ సీతలాంటి అమ్మాయిని ఈ రోజుల్లో చూడటం చాలా అరుదు అనుకోండి. మమ్మల్ని స్వంత బంధువుల్లా ఆదరిస్తుంది!”

ఆ మాటకు సీత తల అడ్డంగా వూపుతూ “బంధువుల్లా అనటం సరికాదు... మీరందరూ నా స్వంత బాబాయ్ ల్లానే అనిపిస్తారు! అందుకే గొప్ప భరోసాగా ఉంటుంది నాకు!” అంది.

ఇంకొకాయన వెంటనే జవాబు చెప్పాడు. “అవునండీ సీతకు మేం భరోసాగా ఉంటాం! సీత మాకు ఆసరా! ఇది మాత్రం నూటికి నూరు పాళ్ళు నిజం! మా ఇళ్ళల్లో ఏం జరిగినా దగ్గిర బంధువులు వస్తారో రారో గానీ సీత మాత్రం ముందుగా వచ్చి మా ఇంట్లో వాళ్ళ చేతికి ఆసరాగా నిలబడుతుంది. ఏ పని తలపెట్టామో, అది పూర్తయేవరకూ ఏ వేళకి ఇంత నోట్లో వేసుకుంటుందో, ఎపుడు నిద్రపోతుందో ఎవరికీ తెలియదు! అంతలా అన్ని పనులూ చూసుకుంటుంది!”

ఆ మాటలకు అవునన్నట్లు అందరూ తలవూపారు.

ఆనందరావు నోరు విప్పాడు.. ‘‘ సీత పేరు వలనో ఏమోగానీ ‘డొక్కా సీతమ్మ’ గారి లక్షణాలూ కొన్ని వచ్చాయని నేను సరదాగా అంటే... అంత గొప్పావిడితో పోలిక ఏమిటంటూ కోప్పడుతుంది గానీ... నాకు మాత్రం ఆవిడలోని కాంచెం అంశ అబ్బినట్లుగా అనిపిస్తుందండీ! డొక్కా సీతమ్మగారి గురించి ఒక కథ ప్రాచుర్యంలో ఉన్నది విన్నానండీ! సీతమ్మగారు ఎవరో బంధువులింటికి పనిమీద వెళ్తూ మార్గమధ్యలో ఏదో సత్రంలో కాబోలు విడిది చేస్తే... అక్కడ ఒక తల్లి ఆకలంటూ గోల చేస్తున్న పిల్లాడిని ‘ఇంకెంత కొంచెం దూరమేగా, సీతమ్మగారి ఇంటికి వెళ్తాంగా ..కడుపునిండా భోజనం చేద్దువుగానీ’ అంటూ సమదాయించడం విని ఆవిడ వెంటనే తన ప్రయాణాన్ని రద్దుచేసుకుని, వెనక్కి వచ్చేస్తుందని అంటారు!. వాళ్ళ భోజనం ఏర్పాట్లు చేయటానికన్న మాట! ఆవిడదంత గొప్ప మనసని చెప్పటానికి ఈ ఉదంతాన్ని ఉదహరిస్తూంటారు.